



పడిపోయిన నీటిమట్టం

ప్రాణనది కొన ఊపిరితో కనిపిస్తోంది. జీవనది జలకళను కోల్పోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల దాహార్తిని, సాగునీటి కష్టాలను తీర్చే కృష్ణమ్మ ఇప్పుడు కన్నీరు పెడుతోంది. ప్రజల గొంతును తడిపే జలదేవతకు గొంతు ఎండిపోతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. పదిహేనేళ్ల కిందటి గడ్డు పరిస్థితికి మళ్లీ చేరింది.



ప్రకాశం బ్యారేజీ వద్ద పైకి తేలుతున్న ఇసుక (సర్కిల్‌లో)

తగ్గినది

పదిహేనేళ్ల తర్వాత కృష్ణానదికి గడ్డు పరిస్థితి

ప్రకాశం బ్యారేజీ వద్ద పైకి తేలిన ఇసుక

- 6.1 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- 1.68 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వలు
- 2015 తర్వాత మళ్లీ ఇప్పుడే..
- పులిచింతలలోనూ అదే పరిస్థితి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ నిపుణులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ వద్ద సరిగ్గా ఏడేళ్ల క్రితం ఉన్న పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. మార్చిలోనే నది నీటిమట్టం దారుణంగా పడిపోతోంది. ప్రస్తుతం నది పరిస్థితిపై జలవనరుల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే నదీజలాలు అడుగంటిపోతుంటే, రాబోయే రెండు నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావమే..

ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12.0 అడుగులు, నీటిసామర్థ్యం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం ఇక్కడ 6.1 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. నీటినిల్వలు 1.68 టీఎంసీలు ఉన్నాయి. ఈ ఏడాది ఇది దయనీయమైన పరిస్థితి. నీటిమట్టంతో పాటు నిల్వలు అడుగంటిపోతున్నాయి. బ్యారేజీ గేట్లకు వెనుక వైపున ఉన్న కాంక్రీట్ దిమ్మల వద్ద ఇసుక పైకి కనిపిస్తోంది. సరిగ్గా ఇదే పరిస్థితి 2015లో కనిపించింది. ఆ సంవత్సరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.1 అడుగులుగా నమోదైంది. నాడు 1.68 టీఎంసీల నీటి నిల్వలు రికార్డయ్యాయి. కాగా, జూలై నుంచి అక్టోబరు, నవంబరు వరకు కురిసే వర్షాలకు బ్యారేజీకి వరదలు వస్తాయి. ఆ సమయంలో గేట్లను పైకెత్తి లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసేవారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆ పరిస్థితి కనిపించలేదు. ఆగస్టు, సెప్టెంబరుల్లో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు వాగులు, వంకల్లో కురవడంతో వేల క్యూసెక్కుల్లోనే ఇన్‌ఫ్లో నమోదైంది. ఈ సమయంలో నీటిని సముద్రంలోకి విడుదల చేశారు.

చింత తీర్చని పులిచింతల

బ్యారేజీకి ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి సమయంలో పులిచింతల నుంచి నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉండేది. అటువంటిది ఈ ఏడాది ప్రకాశం బ్యారేజీ వద్ద ఎటువంటి పరిస్థితి ఉందో పులిచింతల ప్రాజెక్టు దగ్గరా అదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు. నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. ప్రస్తుతం నీటిమట్టం 123.489 అడుగులు, నీటినిల్వలు 4.6844 టీఎంసీలు ఉన్నాయి. గడిచిన ఏడాది ఇదే సమయానికి నీటిమట్టం 173.75 అడుగులు ఉండగా, నీటినిల్వలు 43.8 టీఎంసీలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేకపోగా, అవుట్‌ఫ్లో ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం ఉన్న నీటిలో 200 క్యూసెక్కులు ఆవిరిరూపంలో పోతోంది. ఇదిపోగా, మిగిలిన నీటిని తిరిగి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుకుండలా తయారయ్యే వరకు పొదుపుగా ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.



ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి సామర్థ్యం ఇలా..

సంవత్సరం	నీటిమట్టం (అడుగుల్లో)	నీటి సామర్థ్యం (టీఎంసీల్లో)
2014	12.0	3.07
2015	6.1	1.68
2016	12.0	3.07
2017	12.0	3.07
2018	12.0	3.07
2019	12.0	3.07
2020	12.0	3.07
2021	12.0	3.07
2022	12.0	3.07
2023	12.0	3.07
2024	6.1	1.68

ప్రచారాస్త్రం

జిల్లాలో అధికార, విపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలు

- సామాజిక వర్గాలవారీగా టీడీపీ కూటమి ప్రచారం
- గ్రామ, మండల స్థాయిలో నాయకుల నియామకం
- అసమ్మతివాదులను బుజ్జగించే పనిలో వైసీపీ
- పామర్రులో వైసీపీ టార్గెట్‌గా కాంగ్రెస్ తరపున డీవై దాస్ ప్రచారం
- పెడనలో సతీమణుల సమేతంగా అధికార, ప్రతిపక్ష అభ్యర్థులు
- కూటమి మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థులపై ఉత్కంఠ



ఒకరిది వ్యూహం.. మరొకరిది ప్రతివ్యూహం.. ఒకవర్గం ప్రచారం.. మరొక వర్గం ప్రలోభం.. ఒకరు ఎలాగైనా పాగా వేయాలనే తాపత్రయం.. ఇంకొకరు పగ తీర్చుకోవాలనే ప్రచార తంత్రం.. ఎన్నికలకు ఇంకా 50 రోజులు ఉండగానే, జిల్లాలో అధికార, ప్రతిపక్షాలు తమ అస్త్రాలకు పదును పెట్టుకుంటున్నాయి. వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు కదులుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో పని విభజన సులువైంది. ఆయా సామాజిక వర్గాల్లోని జిల్లా, మండలస్థాయి నాయకులను రంగంలోకి దింపి, గ్రామాల్లోకి పంపుతూ తమదైనశైలిలో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఇంతకాలం అధికారం అనుభవించి, అసమ్మతివాదులను పక్కనపెట్టిన వైసీపీ నాయకులు తాజాగా వారిని బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ప్రచారాలు, ప్రలోభాలతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

బందరులో వ్యూహ.. ప్రతివ్యూహాలు

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల వ్యూహంతో ముందుకు కదులుతున్నారు. గ్రామాలతో పాటు నగరంలోని వార్డుల్లో పర్యటిస్తూ వైసీపీలో అసమ్మతి నాయకులను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర ఈసారి వ్యూహం మార్చి ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఇక సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని అసమ్మతివాదుల ఇళ్లకు వెళ్లి తన తనయుడు పేర్ని కిట్టూను గెలిపించాలని కోరుతున్నారు. కానీ, ఇంతకాలం తమను పట్టించుకోకుండా.. ఎన్నికల ముందు గుర్తొచ్చామా అని అసమ్మతివాదులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పామర్రులో పగలు.. ప్రతీకారాలు

పామర్రు నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ ఉంటుంది. అయితే, అనూహ్యంగా పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తానని ప్రకటించారు. ఎన్నికల కోడ్ రాకముందే ఆయన గ్రామాల్లో పర్యటించి తన వర్గీయుల మద్దతును కూడగడుతున్నారు. గతంలో వైసీపీలో ఉన్న డీవై దాస్‌ను అకారణంగా సస్పెండ్ చేశారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం ఆయన పని చేశారు. దీంతో ఆయన వైసీపీ ఓటమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థిగా తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. దీనివల్ల వైసీపీ ఓటుబ్యాంకుకు గండిపడే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా నియోజకవర్గంలోని గ్రామాల్లోని పెద్దలను కలుసుకుని పార్టీ గెలుపు కోసం అభ్యర్థిస్తున్నారు. ఇక వైసీపీ నాయకులు బుధవారం నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు.

పెడనలో పోటాపోటీ ప్రచారాలు

పెడన నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎంపికై, ప్రస్తుతం మంత్రిగా ఉన్న జోగి రమేశ్ పెనమలూరు నియోజకవర్గానికి వెళ్లిపోయారు. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో పెడన నుంచి తప్పించారు. ప్రస్తుతం టీడీపీ తరఫున కాగిత కృష్ణప్రసాద్ పోటీలో ఉన్నారు. వైసీపీ తరఫున ఉప్పాల రాము పోటీ చేస్తున్నారు. కాగిత కృష్ణప్రసాద్ 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠత కోసం పనిచేస్తూ వచ్చారు. దీంతో టీడీపీ అధిష్ఠానం ఆయనకే మళ్లీ టికెట్ ఇచ్చింది. వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము, టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో తీవ్ర పోటీ నెలకొంది. బీసీ ఓటర్లు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఎవరిని విజయం వరిస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. తమతమ సతీమణులతో కలిసి వీరు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

కూటమి మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి ఎవరు..?

మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి పేరును ఇంకా ఖరారు చేయకపోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎంపీ అభ్యర్థిత్వంపై జిల్లా స్థాయిలో ప్రభావం ఉండనుండటంతో ఎవరిని ప్రకటిస్తారోనని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, ఎంపీ అభ్యర్థిగా గ్రీన్‌కో కంపెనీ డైరెక్టర్ బండారు నరసింహారావు పేరు వినిపిస్తుండటంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇక.. టీడీపీకి సంబంధించి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించగా, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి పేరుపై ఉత్కంఠ నెలకొంది. మండలి బుద్ధప్రసాద్‌కే అవనిగడ్డ సీటును కేటాయించాలని టీడీపీ నియోజకవర్గ నాయకులు కోరుతున్నారు. అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.



వైసీపీ నాయకుల మీడియా సమావేశంలో వలంటీర్ పవన్ (సర్కిల్‌లో..)

వైసీపీ భజనలో వలంటీర్లు

వైసీపీ మీడియా సమావేశంలో పాల్గొన్న చిరిచింతల వలంటీర్

- నీలిపూడిలో ప్రజాదీవెనలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లు, ఐదుగురు బుక్ కీపర్లు
- విధుల నుంచి తొలగింపు

గుడివాడ/కృత్తివెన్ను, మార్చి 26 : అధికార వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో వలంటీర్లు యథేచ్ఛగా పాల్గొంటున్నారు. ఇటీవల స్థానిక 24వ వార్డులో ఇద్దరు వలంటీర్లు వైసీపీ నాయకుడితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అయినా అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. దీనిని అలుసుగా తీసుకుని మరికొంత మంది వలంటీర్లు బహిరంగంగానే వైసీపీ ప్రచార కార్యక్రమాలు, పత్రికా సమావేశాల్లో పాల్గొంటున్నారు. గుడివాడ రూరల్ మండలం చిరిచింతలకు చెందిన కల్లేపల్లి పవన్‌కుమార్ వలంటీరుగా, వైసీపీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం స్థానిక వైసీపీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో అతను పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా, వైసీపీ సమావేశంలో పాల్గొన్న వలంటీర్ కల్లేపల్లి పవన్‌కుమార్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. అతడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు గుడివాడ ఎంపీడీవో జ్యోతి తెలిపారు.

- కృత్తివెన్ను మండల పరిధిలోని నీలిపూడి గ్రామంలో పెడన వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమంలో ఇద్దరు వలంటీర్లు, ఐదుగురు బుక్ కీపర్లు పాల్గొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ పార్టీ ప్రచారంలో పాల్గొనటం, అభ్యర్థులతో కలిసి ఫొటోలు దిగటం చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు వెల్లువెత్తడంతో అధికారులు విచారణ జరిపి విధుల నుంచి సస్పెండ్ చేశారు.

బిళ్లనపల్లిలో నేడు భువనేశ్వరి పర్యటన



హనుమాన్ జంక్షన్ రూరల్, మార్చి 26 : టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం బాపులపాడు మండలంలోని బిళ్లనపల్లి గ్రామంలో పర్యటించనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆమె పరామర్శిస్తారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు భువనేశ్వరి బిళ్లనపల్లి గ్రామానికి చేరుకుంటారు. కాగా, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎదురువాడ కిరణ్ (48), ఎదురువాడ బసవరావు (85) కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించేందుకు టీడీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇక్కడ ఓటు అమ్మబడదు

తన ఇంటికి ఓ పాస్టర్ బ్యానర్

తోట్లవల్లూరు, మార్చి 26 : ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంపిణీ చేయటం ప్రతి ఎన్నికల్లో చూస్తున్నాం. పోలింగ్ ముందురోజు రాజకీయ పార్టీల నేతలు ఓటర్ల లిస్టులు దగ్గర పెట్టుకుని మరీ ఇలా ప్రలోభాలకు గురిచేస్తుంటారు. అయితే, పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరులోని పాస్టర్ వల్లూరు సొలొమాన్ 'నేను క్రైస్తవుడను. నా ఓటు అమ్మను' అంటు ఏర్పాటుచేసిన బ్యానర్‌ను ఇంటి ప్రధాన గేటుకు కట్టడం అందరినీ ఆకర్షించింది. డబ్బుకు అమ్ముడుపోతూ, ఉచిత పథకాలను జై కొడుతున్న కాలంలో పాస్టర్ నిజాయితీని ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు.



'నా ఓటు అమ్మను' అంటూ ఇంటి గేటుకు కట్టిన బ్యానర్

మట్టి అక్రమ తవ్వకాలపై నిఘా


ఇన్‌చార్జి ఆర్డీవో, ముడా వీసీ పి.వెంకటరమణ

మచిలీపట్నం టౌన్, మార్చి 26 : ముడా భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఇన్‌చార్జి ఆర్డీవో, ముడా వీసీ పి.వెంకటరమణ హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన ముడా భూముల్లో అక్రమ మట్టి తవ్వకాల వరుస కథనాలపై కలెక్టర్ రాజాబాబు, ముడా వీసీ, ఆర్డీవో స్పందించారు. అక్రమ మట్టి తవ్వకాలపై నిఘా ఉంచాలని నిర్ణయించారు. ఇన్‌చార్జి ఆర్డీవో పి.వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం ముడా కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. బందరు డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్ సుబానీ, తహసీల్దార్ సతీష్, సీఐ నాగప్రసాద్, ఆర్ఐ యాకుబ్‌లు పాల్గొన్నారు. కర్రగ్రహారం, మంగినపూడి, తపసిపూడి, మేకావారిపాలెం గ్రామాల్లో మట్టి తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు సిబ్బంది తెలిపారు. రెవెన్యూ, మైన్స్, పోలీసు, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు గట్టి నిఘా చేపట్టాలని వెంకటరమణ సూచించారు. రాడార్ కేంద్రం, మిడ్‌లాండ్, బుద్ధాలపాలెం వద్ద మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాత్రి సమయాల్లో నిఘా బృందాలు పర్యటించాలన్నారు.

కూలిన బతుకులు

- వీరపనేనిగూడెం వద్ద కూలీలు వెళ్తున్న ఆటో బోల్తా
- ఇద్దరు మహిళలు మృతి.. 21 మందికి గాయాలు

ఉంగుటూరు, మార్చి 26 : ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 23 మందితో వెళ్తున్న ఓ ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. మృతులు ఏరోజుకారోజు కూలిపని చేసుకునేవారు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ సహా 13 మందికి తీవ్రగాయాలు కాగా, మరో 8 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఆత్కూరు ఎస్సై ఏ.పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం చినఆగిరిపల్లి శివారు గొల్లగూడేనికి చెందిన కొంతమంది మహిళా కూలీలు రోజూ ఉదయం 6 గంటలకు ఆటోలో గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి కూలి పనుల కోసం వెళ్తుంటారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇళ్లకు చేరుతుంటారు. ఈ క్రమంలో తోటపల్లికి చెందిన చాగంటిపాటి శివరామ కృష్ణకు చెందిన ఆటోలో 23 మంది (డ్రైవర్ సహా) మహిళా కూలీలు ఎక్కారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు చిన ఆగిరిపల్లి నుంచి తెంపల్లి గ్రామానికి బయల్దేరిన ఆటో మార్గం మధ్యలో వీరపనేనిగూడెం ప్రభుత్వ వైన్‌షాపు దగ్గర కొచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న బైకును తప్పించే క్రమంలో ఆటోడ్రైవర్ హఠాత్తుగా సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. కూలీలందరూ రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో వీర్ల కృష్ణకుమారి (45), వీర్ల సుజాత (30) సంఘటనాస్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన బడుగు శివనాగేంద్రమ్మ (35), జువ్వనబోయిన లక్ష్మీపార్వతి (33), జువ్వనబోయిన నిర్మల (40), గుంట్రు ధనలక్ష్మి (45), జువ్వనబోయిన ప్రభావతి (44), చెన్ను వీరమ్మ (65), డిల్లీ నవ్య (19), వీర్ల సుజాత (35), జువ్వనబోయిన వాణిశ్రీ ((30)ను చినఅవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రికి, సాకిరి నాగమణి (50), గుంట్రు పద్మావతి (40)ని విజయవాడ జీజీహెచ్‌కు, వీర్ల సుజాత(38)ను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోడ్రైవర్ శివరామకృష్ణ నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సామర్థ్యానికి మించి ఆటోలో కూలీలు ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో





మృతులు వీర్ల కృష్ణకుమారి, సుజాత (ఫైల్)

క్షతగాత్రులను పరామర్శించిన కొలుసు పార్థసారథి

వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారులను ఆరా తీసిన ఆయన మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను నూజివీడు అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కూడా పరామర్శించారు.

అంధకారంలో పెదకళ్లేపల్లి పంచాయతీ

- బిల్లులు చెల్లించలేదని వీధి దీపాల నిలిపివేత
- పంచాయతీ నిధులు పక్కదారిన తరలించేశారు : సర్పంచ్ ఆక్రోశం

- 6లో..



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (బుధ)

సహర్ (ఉదయం) : 4-46 (గురు)






ఉయ్యూరు, కంకిపాడు సెంటర్లలో జగన్మోహన్‌రెడ్డి బ్యానర్లు

నిబంధనలకు నీళ్లు..

కంకిపాడు/ఉయ్యూరు, మార్చి 26 : ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కంకిపాడు బస్టాండ్ సెంటర్, ఉయ్యూరు సెంటర్‌లోని భవనాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటో, ఫ్యాన్ గుర్తుతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై పెనమలూరు రిటర్నింగ్ అధికారి డి.రాజును వివరణ కోరగా మండలానికి ఓ బ్యానర్ ఏర్పాటుకు కలెక్టర్ నుంచి వైసీపీ నాయకులు అనుమతి పొందారని చెప్పారు.

పంచాయతీ కార్యాలయంలో ప్రచార బోర్డులు


వీరులపాడు : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కొందరు అధికారులు జగన్ ప్రభుత్వంపై స్వామిభక్తిని చాటుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరులపాడు మండలం వెల్లంకి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వ పథకాల ప్రచార పోస్టర్లు జగన్ బొమ్మతో దర్శనం ఇస్తూనే ఉన్నాయి.



వెల్లంకి పంచాయతీ కార్యాలయంలో పోస్టర్లు



యాక్షన్ ప్లాన్

- ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం 'పంచతంత్రం'
- సూర్యాపేట, ఖమ్మం, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లా సరిహద్దులే టార్గెట్
- ఓటర్లను ప్రలోభపెట్టే డబ్బు, మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి
- పోలీసు, రెవెన్యూ, ట్రెజరీ, సెబ్, ఎక్సైజ్ శాఖలతో నజర్
- పొరుగు జిల్లాలతో మైత్రీ సంబంధాలకు శ్రీకారం
- ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణాల ఫోకస్





ఎన్నికల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు వీలుగా ఓటర్లను ప్రలోభపెట్టే అంశాలపై జిల్లా ఎన్నికల యంత్రాంగం 'పంచ' తంత్రం విధానాన్ని అవలంబిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా సరిహద్దున సూర్యాపేట, ఖమ్మం, ఏలూరు, కృష్ణా, గుంటూరు వంటి ఐదు జిల్లాలపై దృష్టి సారించింది. బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలైన రెవెన్యూ, ట్రెజరీ, సెబ్, ఎక్సైజ్ శాఖలతో కలిసి అడ్డుకట్టు వేసే అంశాలపై దృష్టి సారించింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల తరుణంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు భారీగా డబ్బు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు జిల్లా యంత్రాంగం సరిహద్దు జిల్లాలపై దృష్టి సారించింది. ఇప్పటికే వీటికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్న జిల్లా అధికారులు తాజాగా పొరుగు జిల్లాలతో మైత్రీ సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించారు. మంగళవారం తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా యంత్రాంగంతో చిల్లకల్లులో మైత్రీ సమావేశం జరిగింది. ముందు తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం, ఏపీలోని ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లా యంత్రాంగాలతో కూడా సమావేశాలను నిర్వహించనున్నారు.

ప్రలోభాల కట్టడికి చర్యలు

ఎన్నికలకు డబ్బు పంపిణీపై దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వారికి మార్గదర్శనం చేసింది. వివిధ వ్యక్తుల నుంచి ఒకే వ్యక్తికి జమ అవుతున్న డబ్బుల లావాదేవీలకు సంబంధించి అలాగే అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి నిఘా కొనసాగుతోంది. ఆన్‌లైన్ డబ్బు పంపిణీని నిరోధించే వ్యవస్థలు ఇప్పటికే తమ పని ప్రారంభించాయి. ఇదే సందర్భంలో బయటి నుంచి వచ్చే డబ్బుపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే జిల్లా నలుమూలల సీఆర్ పీఎఫ్ పోలీసులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను జల్లెడ పడుతున్నారు. తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, ఏలూరు జిల్లా, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాలు ఐదు అత్యంత కీలకంగా గుర్తించి ఆపరేషన్స్ ప్రారంభించటానికి వీలుగా ఆయా జిల్లా యంత్రాంగాలతో మైత్రీ సంబంధాలకు తెర తీసింది. దీనిలో భాగంగా జిల్లాలోకి నగదు, ఉచిత బహుమతులు, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను తేలిగ్గా సరిహద్దులను దాటించగలిగే అంశాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుంది. సూర్యాపేట జిల్లాలో గరికపాడు చెక్‌పోస్టు, ముక్త్యేశ్వరపురం నుంచి ఎన్‌హెచ్-65 ఇబ్రహీంపట్నం మీదుగా విజయవాడకు చేరుకునే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా నుంచి గంప్రాయి, పోలంపల్లి, నెమలి, ఊటుకూరు, జొన్నలగడ్డ పెద్దాపురం, మైలవరం, మొర్సుమల్లి, రాజవరం ప్రాంతాల నుంచి, ఏలూరు జిల్లా నుంచి విస్సన్నపేట, తిరువూరుల మీదుగా రెడ్డిగూడెం చేరుకోవటానికి అక్కడి నుంచి మైలవరం మీదుగా విజయవాడకు చేరుకోవటానికి అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. కృష్ణా జిల్లా నుంచి నేరుగా విజయవాడలోకి, గుంటూరు జిల్లా నుంచి తాడేపల్లి రవాణా చేయటానికి అవకాశం ఉందని గుర్తించారు. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఏ మార్గంలో నుంచి వచ్చినా ఈ ప్రాంతాలకు అనుసంధానం కావాల్సిందే. ఈ రూట్ మ్యాప్‌ల ప్రకారం ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టగలిగితే అక్రమ రవాణాను అరికట్టవచ్చని జిల్లా ఎన్నికల యంత్రాంగం భావిస్తోంది.

ఎన్నికల ఏర్పాట్లలో ఇరు రాష్ట్రాల అధికారులు

- సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పెంపు
- సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ల నిర్ణయం


గరికపాడు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణా

జగ్గయ్యపేట రూరల్, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారులు పరస్పరం సమాచారంతో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతిరాణా, సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డేలు సూచించారు. మంగళవారం ధర్మవరప్పాడు తండా సమీపంలోని ఒక కర్మాగార సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆంధ్రా, తెలంగాణా సరిహద్దు సూర్యాపేట, ఎన్టీఆర్ జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో సిబ్బందిని పెంచటంతో పాటు ఆయా శాఖలకు చెందిన 10మంది అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యంగా మద్యం, బంగారం, వెండి, పెద్ద మొత్తంలో పంపిణీకి తరలించే గిఫ్టులు, తదితర సామగ్రిపై దృష్టి సారించాలన్నారు. సీపీ మాట్లాడుతూ, తొమ్మిది చెక్‌పోస్టులు పని చేస్తున్నాయని ఇప్పటికే రూ. 3.6లక్షల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నామని, 30 నుంచి 40 తనిఖీ బృందాలు పనిచేస్తున్నాయని చెప్పారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, రెండు జిల్లాల శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, జీఎస్టీ, ఎక్సైజ్, రవాణా, కస్టమ్స్, కమర్షియల్, ఇన్‌కంట్యాక్స్, ఏసీబీ, అధికారులు పాల్గొన్నారు. నందిగామ ఏసీపీ రవికిరణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గరికపాడు, ముక్త్యాల, గంప్రాయి, వత్సవాయి చెక్‌పోస్టుతో పాటు సూర్యాపేట జిల్లా రామాపురం చెక్‌పోస్టును అధికారులు పరిశీలించారు. వాహనాల తనిఖీలకు ఇబ్బంది లేకుండా రెండు మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీకి సూచించారు. 'ప్రహసనంగా వాహనాల తనిఖీ' ఆంధ్రజ్యోతిలో దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణా స్పందించారు. అధికసంఖ్యలో వాహనాల తనిఖీల్లో కొంత ఇబ్బంది తలెత్తే అవకాశం ఉండటంతో దానికి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. తక్షణం రక్షణ కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నందిగామ ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ రవికిరణ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


రాజీనామా ప్రతులు చూపుతున్న టీడీపీ నాయకులు

అవనిగడ్డ సీటుపై నిరసన సెగలు!

- పలువురు టీడీపీ నేతల రాజీనామా

అవనిగడ్డ, మార్చి 26 : పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించటంపై రెండ్రోజులుగా తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అసంతృప్తి జ్వాలలు చల్లారలేదు. సోమవారం కార్యకర్తల సమావేశంలో సామూహిక రాజీనామాలు చేస్తామని హెచ్చరించిన నేతలు మంగళవారం ఉదయం సమావేశమై పార్టీకి తమ రాజీనామాలను సమర్పించారు. నియోజకవర్గం నుంచి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ గెలిచే అభ్యర్థి అని, కనీస సంప్రదింపులు లేకుండా జనసేన పార్టీకి సీటు కేటాయించటం పట్ల వారు నిరసన తెలియజేస్తూ రాజీనామా ప్రతులను పార్టీ కార్యాలయానికి పంపించారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు నేతృత్వం వహించగా, నిరసన కార్యక్రమంలో టీడీపీ నేతలు యాసం చిట్టిబాబు, కర్రా సుధాకర్, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, బండే కనకదుర్గ, మాదివాడ లక్ష్మీ తులసి, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఘంటసాల రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బీఫామ్ ఇచ్చిన వారికే మద్దతు : బొమ్మసాని



జి.కొండూరు : చంద్రబాబు నాయుడు మైలవరం నుంచి ఎవరికి బీఫామ్ ఇస్తే వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు స్పష్టం చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మంగళవారం ఆయన కలిశారు. అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. పార్టీ విజయానికి కృషి చేస్తానని లోకేశ్‌కు వివరించినట్టు సుబ్బారావు తెలిపారు.

బాబుతోనే ప్రజారంజక పాలన

- వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు



ఉంగుటూరు/గుణదల, మార్చి 26 : విధ్వంసమైన వ్యవస్థలను, పతనమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టగల సత్తా, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రజారంజకపాలన అందించగల పరిపాలనాదక్షత చంద్రబాబుకు మాత్రమే సాధ్యమని గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడలో మంగళవారం ఉంగుటూరు మండలం, వెల్దిపాడు గ్రామానికిచెందిన గన్నవరం మార్కెట్‌యార్డ్ డైరెక్టర్, వైసీపీ బూత్ కన్వీనర్ బొకినాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బూత్ మెంబర్లు మట్టా మునిస్వామి తదితరులు 50మంది టీడీపీలో చేరారు. వీరికి యార్లగడ్డ వెంకట్రావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనతో విసుగుచెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు బొకినాల నాగేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మన్నార్ తదితరులు పాల్గొన్నారు.


సూరాయిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెనిగండ్ల రాము

టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి : వెనిగండ్ల

నందివాడ (ఏబి నగర్), మార్చి 26 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గుడివాడ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం తమిరిశ శివారు ఏ.బి.నగర్, సూరాయిపాలెం, నక్కవారిపాలెం-తమిరిశ గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాగంటి శ్రీనివాసరావు, పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జీ), పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నాయకులచే వెనిగండ్ల రాము 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని, మరో 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రావి మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మోసాలను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో సన్యాసిరావు, సాయి గంగరాజు, అర్జునరావు, కొల్లి బ్రదర్స్, సాల్మన్, వెంకట్రావు, నాగరాజు, కరుణకరావు, రవి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధకారంలో పెదకళ్లేపల్లి పంచాయతీ

- బిల్లులు చెల్లించలేదని వీధి దీపాల నిలిపివేత
- పంచాయతీ నిధులు పక్కదారిన తరలించేశారు : సర్పంచ్ ఆక్రోశం



మోపిదేవి, మార్చి 26 : పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీలో వీధి దీపాల సరఫరా నిలిపివేయటంతో అంధకారం అలుముకుంది. మండలంలో అతిపెద్దదైన పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీలో వీధి దీపాలకు సంబంధించి విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా విద్యుత్ శాఖాధికారులు మంగళవారం సరఫరా నిలిపివేశారు. పంచాయతీ పరిధిలోని వీధిదీపాలు, మంచినీటి సరఫరా వంటి ఇతరత్రా అవసరాలకుగానూ రూ.14 లక్షలు బకాయి ఉన్నట్టు సంబంధిత శాఖాధికారులు తెలియజేశారు. 2021 ఏప్రిల్ నుంచి గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన రూ.56 లక్షల నిధులు కనీస సమాచారం లేకుండా ప్రభుత్వం మినహాయించుకున్నట్టు సర్పంచ్ అరజా సంధ్యారాణి తెలిపారు. ఎప్పటివరకు బకాయిలు చెల్లించారో తెలియజేయకుండా ప్రస్తుతం 14 లక్షల బకాయి ఉందని సరఫరా నిలిపివేయటంపై ప్రభుత్వ తీరును తీవ్ర స్థాయిలో సర్పంచ్ ఆరోపించారు. వీధి దీపాలు నిలిపివేయటంపై సర్పంచ్, ప్రజలు ధ్వజమెత్తారు. రాత్రి సమయంలో ఏమైనా హాని జరిగితే రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ బాధ్యత వహిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 14 లక్షల బకాయిలు దఫాలు వారీగా చెల్లిస్తామని, ప్రస్తుతం ఒక లక్ష చెల్లిస్తామని చెప్పినా సరఫరా నిలిపివేశామని ఆరోపించారు.

ఎట్టకేలకు స్పందించారు

- అనధికార పార్టీ దిమ్మను తొలగించిన అధికారులు


దిమ్మను తొలగిస్తున్న అధికారులు

గుడివాడ : పార్టీలకతీతంగా నిరసనలు వెల్లువెత్తడంతో అధికారుల్లో ఎట్టకేలకు చలనం వచ్చింది. రహదారికి మధ్యలో అడ్డంగా ఉన్న విగ్రహ ఏర్పాటు దిమ్మను మంగళవారం తొలగించారు. ఎన్నికల కోడ్ ముందు 4 రోజులు ముందు అధికార వైసిపి పార్టీ నాయకులు బలవంతంగా కొత్త మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళే రహదారి మధ్యలో విగ్రహ ఏర్పాటుకు దిమ్మను ఏర్పాటు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా దిమ్మను ఏర్పాటు చేయడం పట్ల సొంత పార్టీ నుండే కాకుండా ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, పట్టణ ప్రజలు నుండి కూడా వ్యతిరేకత ఎదురైంది. ఈ విషయమై భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ప్రజల నుండి తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తడంతో మున్సిపల్ అధికారులు మంగళవారం దిమ్మను తొలగించారు. మున్సిపల్ కమీషనర్ బాలసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమీషనర్ కృష్ణారావుల ఆదేశాలతో దిమ్మను పూర్తిగా తొలగించారు.

కమనీయం వేణుగోపాలుని కల్యాణం


నెమలిలో వేణుగోపాలస్వామి కల్యాణం

గంపలగూడెం : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి వేలాది మంది భక్తుల సమక్షంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పరాశరం వెంకట రమణాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపేందుకు కన్యాదానం పీటలపై కూర్చున్న 200మంది దంపతుల గోత్ర నామాలు చదివారు. స్వామి అమ్మవార్లకు నూతన వస్త్రాలు బోయినపల్లి వెంకట కృష్ణారావు సమర్పించారు. వేద మంత్రాల నడుమ అమ్మవార్లకు మాంగల్యధారణ చేయించారు. అనంతరం గరుడ వాహనంలో స్వామిని ఆలయ ప్రవేశం చేయించారు. ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, అసిస్టెంట్ కమిషనర్ ఎన్వీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం

తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు : ఎస్పీ

మచిలీపట్నం టౌన్, మార్చి 26 : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలను ట్రోలింగ్ చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. మంగళవారం ఎస్పీ ఛాంబర్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్ గ్రూపుల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు చేయకూడదన్నారు. వీటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టింగ్‌ల సమాచారాన్ని 9490617672కు ఫోన్ చేసి తెలపవచ్చని, ఈ సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వసంత

రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంటే ఎలా..!

- పరిశ్రమలు రాకుండా ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయి
- చింతలపూడికి నిధులు అడిగినా ఇవ్వలేదు
- వసంత కృష్ణ ప్రసాద్ సంచలన వ్యాఖ్యలు

జి.కొండూరు, మార్చి 26 : సీఎం జగన్మోహన్ రెడ్డి రాజధాని అమరావతి అభివృద్ధి చెందకుండా అడ్డుపడటమే కాక మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంటే ఊరుకోవాలా.. అని మైలవరం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రశ్నించారు. చిన్ననందిగామ గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన ఆత్మీయ సమావేశంలో ఏపీ సీఎంపై సంచలన, ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ఆదాయం లేకుండా ప్రశ్నిమలు రాకుండా ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయన్నారు. రైతుల సాగునీటి అవసరాల కోసం చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి, నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుతో కలిసి తాను జగన్‌కు విజ్ఞాపన పత్రం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. యువతకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు అమలు చేయని కారణంగా ఎస్సీ సోదరుల జీవనోపాధి దెబ్బతిందన్నారు. విదేశీ విద్య రుణాలు కూడా అనేక ఆంక్షలతో కోతలు పెట్టిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సాధించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నేతృత్వంలో త్వరలోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలనకు ప్రజలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), ధనేకుల శ్రీకాంత్, రాయల బసవేశ్వరరావు, మన్నం వెంకట్రావ్, జంపాల సీతారామయ్య, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు



మచిలీపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, విద్యుత్, పంచాయతీరాజ్, తదితరవిభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 266 తాగునీటి చెరువులున్నాయని, వాటిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై నివేదిక ఇవ్వాలన్నారు. బంటుమిల్లి, కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను, పెడన మండలాల్లోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, ట్యాంకర్లద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి చెరువులను నింపేందుకు కాలువలకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదలశాఖ అధికారులతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందన్నారు. ఏప్రిల్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు. కాలువల ద్వారా విడుదలైన నీటిని శివారు ప్రాంతాల్లో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులలో నీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి పథకాలకు సంబంధించి ఫిల్టర్‌బెడ్‌లు, పనిచేయని మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పశువులకు వేసవిలో తాగునీరు అందించాల్సి ఉందని, ఊరచెరువులను నింపాలన్నారు. జిల్లాలో తాగునీటి చెరువుల పూర్తిస్థాయి నివేదికను అందించాలని డీపీవో నాగేశ్వరనాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి టి.శివప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్ కుమార్, మచిలీపట్నం, గుడివాడ, పెడన ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సీ-విజిల్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీ-విజిల్ ద్వారా 160ఫిర్యాదులను ఇప్పటివరకు పరిష్కరించినట్టు కలెక్టర్ రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు పార్టీరంగులతో ఉన్నాయని, రేషన్ బియ్యం పంపిణీచేసే ఎండీయూ వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు.ఎన్నికల నేపథ్యంలో సీ-విజిల్‌ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు.

ఘనంగా ముగిసిన కూచిపూడి నాట్యాంశాలు

కూచిపూడి, మార్చి 26 : బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా వారంరోజులపాటు సాగిన కూచిపూడి నాట్యాంశాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. అరుణ్ రాజ్ కుమార్ (వరంగల్) శిష్య బృందం థిల్లానా, హనుమాన్ చాలీసా, శివాష్టకం అంశాలు ప్రదర్శించగా.. సీతాలక్ష్మి ప్రసాద్ (కొత్తగూడెం) శిష్యబృందం శ్రీనివాస నృత్యరూపకంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించారు. సీతారత్న లలితా కళానృత్యనికేతన్ (కాకినాడకు) చెందిన విజయలక్ష్మీ శిష్యబృందం గంగం గణపతి, పుష్పాంజలి, చక్కని తల్లికి చాంగుభళా, నాట్యాంజలి అంశాలు ప్రదర్శించగా, కూచిపూడి నృత్యాలయ, త్రినాథాచారి శిష్యబృందం (విజయవాడ) కొలువైతివా రంగసాయి, ఆనంద తాండవమాడె అంశాలు ప్రదర్శించారు. రమణకుమారి శిష్యురాలు పుణ్యకీర్తి (విజయనగరం)కు చెందిన కొలువై ఉన్నాడే దేవదేవుడు, శంకరాభరణం తదితర అంశాలతో రంజింపచేశారు. నిర్వాహకులు, కళాకారులకు మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్, కావూరి భానుమూర్తి, వై.ఫణికుమార్, దేవాలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


శ్రీనివాస కల్యాణం నృత్య రూపం

అనధికార పైపుల తొలగింపులో ఉద్రిక్తత

- ప్రత్యామ్నాయం చూపాలని అధికారులను అడ్డుకున్న ప్రజలు
- పోలీసుల సాయంతో వెళ్లిపోయిన అధికారులు

కృత్తివెన్ను, మార్చి 26 : అనధికార పైపుల తొలగింపులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కృత్తివెన్ను మండల పరిధిలోని చినపాండ్రాక గ్రామంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు అనధికార పైపుల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. పైపులను తొలగిస్తుండగా గ్రామస్థులంతా తమకు తాగునీరు అందించేందుకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండ పైపులను ఏలా తొలగిస్తారని ఎదురు తిరిగారు. అధికారులను నిలదీసారు. ఇంతేరు, రామాపురం గ్రామాలకు వెళ్లే పైప్‌లైన్‌కు నీరు రావటం లేదని, దీనికి అనధికార పైపులే కారణమని వాటిని తొలగించి, తమకు నీరివ్వాలని కోరుతూ, ఆయా గ్రామాల వారు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకే వారిచ్చిన ఆదేశాలతోనే పైపులను తొలగిస్తున్నామని ఏఈ ప్రజలకు వివరించారు. అయితే ఆ కాపీని చూపాలని ప్రజలు పట్టుబట్టారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ప్రజలంతా గ్రామ సచివాలయ భవనం వద్ద రోడ్డుపై బైటాయించి ధర్నాకు దిగారు. అధికారులు సచివాలయం వద్దకు చేరుకుగా, జనం సచివాలయాన్ని ముట్టడించి, వాగ్వాదానికి దిగారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా, అధికారులు పోలీసుల సాయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామం చుట్టూ పదుల సంఖ్యలో ఓఎన్‌జీసీ రిగ్గులు ఉన్నప్పటికీ గ్రామాభివృద్ధికి ఏ మాత్రం సాయం చేయటం లేదని గ్రామస్థులు ఆరోపించారు. తమకు తాగునీటి ప్రత్యామ్నాయం చూపకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

ఆలయాలే శక్తి కేంద్రాలుగా సామూహిక హారతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 26 : హిందూ ధర్మ విశిష్టత, సంస్కృతి సంప్రదాయాలను యువతకు తెలియజేసే విధంగా ఆలయాలే శక్తి కేంద్రాలుగా సామూహిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని ధర్మ ప్రచారక్ యడవల్లి పాండు రంగారావు అన్నారు. కొయ్యూరు దేవాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సామూహికహారతి నిర్వహించారు.



సామూహిక హారతిలో భక్తులు

వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1.75 లక్షలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 26 : స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన నాలుగు నెలలకు రూ1,75,500లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాస్ తెలిపారు. గన్నవరం వేంకటేశ్వరస్వామి ఆలయం ఈవో ఎం.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తలు కాకాని అరుణబాబు, తవ్వా పూర్ణచంద్రరావు ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 26 : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకా రవీంద్ర రాధా దంపతులు 200 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు.

అర్చకులపై దాడి బాధాకరం

గన్నవరం(ఉంగుటూరు), మార్చి 26 : కాకినాడ నగరంలోని పురాతన శివాలయంలో సోమవారం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా అర్చకులు సరిగ్గా పూజలు చేయలేదని అసభ్యపద జాలంతో దూషించి, వారిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గన్నవరం బ్రాహ్మణ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, కొన్ని ప్రత్యేక పర్వదినాలు, పండుగల సందర్భాల్లో ఆలయాలు రద్దీగా వుంటాయని, దేవుని దర్శనానికి వచ్చే భక్తులు సంయమనం పాటించకుండా దాడికి దిగటం బాధాకరమన్నారు.

రాష్ట్రాన్ని మత్తుకు కేంద్రంగా మార్చిన సైకో

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 26 : మత్తు పదార్థాల కేంద్రంగా నవ్యాంధ్రను మార్చిన ఘనత సైకో జగన్ రెడ్డిదేనని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని మత్తు పదార్థాల ఉత్పత్తి కేంద్రంగా మార్చిన జగన్ రెడ్డి గంజాయిని ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు సరఫరా చేసే పనిలో తన పార్టీ నాయకులను ఉంచాడని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తున్నానని ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి అదే విశాఖకు ఏభైవేల కోట్ల విలువైన హెరాయిన్‌ను దిగుమతి చేసుకొని విశాఖ ప్రతిష్టను మంట కలిపాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అను మోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, కుర్రా నరేంద్ర, తుమ్మల రాంకుమార్, మన్నె రాజాబాబు, అంగిరేకుల మురళి, ఉయ్యూరు మహేష్, కాసిం, మన్నె వాసు, ఆచంట చంటి, కొమ్మినేని వెంకటేష్, బోడె సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. నిబద్ధతగల నాయకుడు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు అని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ పోరంకి టీడీపీ కార్యాలయంలో నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, ఆకునూరి సుబ్బారావు, ఇంటూరి మురళి, వణుకూరి విక్రమ్, అన్నవరపు శివపార్వతి, కోటేశ్వర రావు, జానకిరామయ్య, సంగెపు రంగారావు, గోపీ చంద్ తదితరులు పాల్గొన్నారు.

బోడె గెలుపే లక్ష్యంగా పనిచేయండి

కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను గెలిపించుకోవాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన క్లస్టర్ పరిధిలోని బూత్ ఇన్‌చార్జిలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్క సారీ సీటు లేదని చంద్రబాబు నాయుడు ప్రకటించిన అనంతరం సీటు సాధించుకోవడం కష్టమన్నారు. అటువంటిది బోడె ప్రసాద్ సీటు సాధించుకోవడం ఒక చరిత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, పీతా గోపిచంద్, పులి శ్రీనివాస రావు, మాదు నాగరాజు, షేక్ బాబు సుబాని, సొంటి శివరామ ప్రసాద్, ఏనుగ జయప్రకాష్, బొర్రా వెంకట్, వణుకూరు విక్రం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని రాజా, పక్కన తుమ్మలపల్లి, సుదిమళ్ల తదితరులు

నిజం గెలవాలి విజయవంతం చేయండి

ఈ నెల 28న నియోజకవర్గంలోని పెనమలూరు మండలంలో నిర్వహించనున్న నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు అక్రమ అరెస్టుతో పెనమలూరు మండలానికి చెందిన ఓ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి ఈ నెల 28న నారా భువనేశ్వరి రానున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



యార్లగడ్డకు ప్రసాదం, స్వామివారి శేషవస్త్రం అందజేసిన పార్టీ నాయకులు

యార్లగడ్డ విజయం సాధించాలని కాశీలో పూజలు

గుణదల, మార్చి 26 : గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ, విజయవాడ రూరల్ మండలంలోని పి.నై నవరం గ్రామానికి చెందిన 40మంది టీడీపీ నాయకులు కాశీలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వచ్చిన వారు యార్లగడ్డ వెంకట్రావును విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి కాశీ ప్రసాదం దేవుని ప్రతిమ, స్వామివారి శేషవస్త్రం అందజేశారు. పార్టీ నాయకులు తనపట్ల ఉంచిన అభిమానానికి యార్లగడ్డ వెంకట్రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరి సతీష్, దూళిపాళ్ల నాని, సోమేశ్వరరావు, గుజ్జర్లపూడి బాబూరావు, గొడ్డళ్ల చినరామారావు, చప్పిడి రమేష్, కొండేటి శ్రీనివాసరావు, సాతులూరి కోటేశ్వరరావు, షేక్ లాల్ బాషా, షేక్ నబీ, బెజవాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా చెల్లెమ్మల సొమ్ము దిగమింగిన జగన్

డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బొప్పన నీరజ

కంకిపాడు, మార్చి 26 : డ్వాక్రా అక్క చెల్లెమ్మల సొమ్ము సీఎం జగన్ దిగమింగాడని డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బొప్పన నీరజ ఆరోపించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడుతూ, జనవరి 20న సీఎం జగన్ బటన్ నొక్కి అసరా సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని, ఆ నాటి నుంచి నేటి వరకు అక్క చెల్లమ్మల ఖాతాల్లో ఆ సొమ్ము జమ కాలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్న డ్వాక్రా, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలను జగన్ మోసం చేశాడని మండిపడ్డారు. మహిళలను అన్ని విధాలుగా మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం మళ్లీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో చీరలు, కుక్కర్లు, కాళ్ల పట్టీలతో ఓట్లు అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా చంద్రబాబు కృషి చేస్తే, సీఎం జగన్ మోహన్ రెడ్డి మాత్రం ఆసరా డబ్బులను దోచుకున్నాడని మండపడ్డారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ఈదులడొంకలో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్న నాయకులు

గోసాల (కంకిపాడు), మార్చి 26 : రెండు రోజులుగా తాగునీటి సరఫరా చేయడంలో పంచాయతీ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సెంగెపు రంగారావు అన్నారు. గోసాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదులడొంకలో రెండు రోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు స్థానిక టీడీపీ నాయకులు కోనేరు సాంబశివరావు ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో అధికారులు పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. రెండు రోజుల నుంచి మోటార్ మరమ్మతులకు గురైనా పట్టించుకోని ఈవో ప్రసాద్‌కు ఫోన్ చేసి మండిపడ్డారు. తక్షణం మోటారు మరమ్మతు చేసి తాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోసాల గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ మాబు సుబాని, కోటేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

ఉంగుటూరు, మార్చి 26 : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణా కేంద్రం (యూబీఆర్ ఎస్ఈటీఐ)లో ఏప్రిల్ 1నుంచి వివిధ కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు శిక్షణాకేంద్రం డైరెక్టర్ పి.మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కంప్యూటర్ ఎకౌంటింగ్, ట్యాలీ (30 రోజులు), డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (45రోజులు), మహిళా టైలరింగ్ (30రోజులు) కోర్సుల్లో శిక్షణ వుంటుందన్నారు. ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డు కలిగి, 18-35ఏళ్ల మధ్య ఉండి కృష్ణాజిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులుపై కోర్సుల్లో శిక్షణపొందేందుకు అర్హులన్నారు. వివరాలకు 9951920120, 6304254730 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కేసులు



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పెద్దిరాజు

గన్నవరం(ఉంగుటూరు), మార్చి 26 : మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్టు గన్నవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాసా పెద్దిరాజు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గన్నవరంలోని వివిధ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్థానిక మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, రోడ్డుప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు.

టీడీపీతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి

పెదఓగిరాల(ఉయ్యూరు), మార్చి 26 : రాష్ట్రంలో చదువుకున్న యువకులకు ఉద్యోగాలు, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్ప నకు తెలుగు దేశంప్రభుత్వం ఏర్పాటుకు అందరూ సహకరించాలని టీడీపీ పెనమలూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ అన్నారు. పెదఓగిరాలలో మంగళవారం పార్టీనాయకులతో కలసి పర్యటించి చంద్రబాబు ప్రకటించిన సిక్స్ గ్యారంటీలు ప్రజలకు వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చదువుకున్న యువకులకు ఉద్యోగాలు లేక, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈపరిస్థితుల్లో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సంగెపు రంగారావు, పార్టీ గ్రా మ అధ్యక్షుడు పోతిరెడ్డి, ప్రసాద్, రంగారావు, హుస్సేన్ ఖాన్, సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదఓగిరాలలో శంఖారావం కార్యక్రమంలో బోడె వెంకట్రామ్

ఎన్నికల నియమావళి పట్టని రెవెన్యూ శాఖ!

• పొలాల్లో కనిపిస్తున్న భూసర్వే రాళ్లు



శోభనాద్రిపురంలోని పొలాల్లో జగనన్న భూ రక్ష రాళ్లు



రంగుపూయని భూ సర్వే రాళ్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 26 : రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై వారం రోజులైనా రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు ఎన్నికల నియమావళి పాటించకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బాపులపాడు మండలం శోభనాద్రిపురం, బొమ్ములూరు, అంపాపురం గ్రామాల్లో భూసర్వే పూర్తిచేశారు. సర్వే నిర్వహించిన కొన్ని చోట్ల మాత్ర మే జగనన్న భూసురక్ష రాళ్లు వేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం పార్టీపేరుకు సంబంధిత వివరాలు కనిపించకూడదు. కానీ రెవెన్యూశాఖ మాత్రం ఈ విషయంలో అలక్ష్యం ప్రదర్శిస్తూ పొలాల్లో నాటిన రాళ్లతో పాటు శోభనాద్రిపురం వద్ద అలాగే పడేశారు. ఎన్నికల నియమావళి పాటించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానిక ప్రజలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటికి కనీసం తెల్లరంగు పూయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ మళ్లీ వస్తే ప్రభుత్వ సంస్థలు ప్రైవేటుపరం

సీఐటీయూ నాయకుడు ముజఫర్ అహ్మద్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ముజఫర్ అహ్మద్

గన్నవరం(ఉంగుటూరు), మార్చి 26 : దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వసంస్థలు పూర్తిగా ప్రైవేటుపరం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. గన్నవరంలోని అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో మంగళవారం సీఐటీయూ డివిజన్‌స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముజఫర్ మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ప్రభుత్వ రంగ సంస్థల్లో కొన్ని విభాగాలను ప్రైవేటుపరం చేశారని, టెలీకమ్, విమానాశ్రయాల్లో జరుగుతున్న వ్యవహారమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అదాని, అంబానీలకు వాటిని కట్టబెట్టేందుకు మోదీ సిద్ధమయ్యారని, విద్యుత్‌రంగంలో కూడా సంస్కరణలు తీసుకువచ్చి ఒకటికి ఏడురెట్లు కరెంటు బిల్లులు పెరిగే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. మరోవైపు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొం దాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్నభోజనపథకం కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేసి ప్రభుత్వాలను నిలదీస్తున్న సీఐటీయూకి వామపక్షాలు పూర్తిగా సహకారం అందిస్తున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎర్రజెండా అభ్యర్థి గన్నవరంలో పోటీ చేస్తున్నారని కార్మికులంతా మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కార్మికులంతా ఇంటింటికీ వెళ్లి కార్మికుల కోసం పనిచేసే ఎర్రజెండా అభ్యర్థికి ఓటువేయాలని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత వుందన్నారు. నాలుగు మండలాల్లోని అసంఘటిత కార్మికులంతా ఏకమై మీ వంతు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, బేతా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కడవకొల్లు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో వాణీమోహన్

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర పరిశ్రమలు, పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ మోహన్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు ఆమెకు అందజేశారు.

నిర్భయంగా ఓటు వేయండి : సీఐ



తోట్లవల్లూరు, మార్చి 26 : ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ కిషోర్‌బాబు, కోరారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్సై పి.విశ్వనాథ్ నేతృత్వంలో కేంద్ర బలగాలు మంగళవారం భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్ళంవారిపాలెం, ఆళ్ళవారిపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించాయి.

కారులో రూ.4 లక్షలు సీజ్



కూచిపూడి, మార్చి 26 : అయ్యంకి గ్రామ సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ సందర్భంగా రూ.4లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు టి.ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. పామర్రు నుంచి కూచిపూడి వస్తున్న అయ్యంకి గ్రామానికి చెందిన వీరంకి రఘుబాబు కారును తనఖీ చేయగా రూ.4లక్షలు ఉన్నట్లు గుర్తించామన్నారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపనందున సీజ్ చేసి జిల్లా స్థాయి జమాఖర్చుల కమిటీకి నివేదిక అందజేస్తున్నట్లు తెలిపారు.

జనసైనికులు సంయమనం పాటించాలి : గుడివాక

అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ప్రకటన వచ్చే వరకూ నియోజకవర్గ జనసైనికులు ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషబాబు కోరారు. అవనిగడ్డలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజులుగా టీడీపీ శ్రేణులు రాజీనామాలు చేస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ శ్రేణులు సంయమనం పాటించాలన్నారు. అభ్యర్థి ఫైనల్ అయ్యే వరకూ జనసైనికులు తొందరపడవద్దని సూచించారు.

విశ్వనాథపల్లి నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.8.21లక్షలు

కోడూరు, మార్చి 26 : విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మకు హుండీ ఆదాయం రూ.8,21,759లు వచ్చినట్లు ఆలయ ఈవో కె.సుధాకర్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారి కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో గ్రామస్థుల సమక్షంలో ఆలయ హుండీలు మంగళవారం లెక్కించినట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరం కంటే రూ.1,35,310 ఎక్కువ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు హుండీల లెక్కింపు

మోపిదేవి : పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి హుండీలలెక్కింపు ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్. చక్రధరరావు తెలియజేశారు. 28వ తేదీన మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీల కానుకలు లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు.





గురిజేపల్లిలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న పెడన టీడీపీ అభ్యర్థి కాగిత సతీమణి శిరీష

కుమార్‌రాజాను గెలిపించాలని కోరుతూ పామర్రు నాయీబ్రాహ్మణ కాలనీలో ప్రచారం

అవినీతి వైసీపీని తరిమికొట్టండి

పెడన/పెడన రూరల్, మార్చి 26 : ఐదేళ్ల వైసీపీ పాలనలో పెడన నియోజకవర్గంలో అంతులేని అవినీతి జరిగిందని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి శిరీష ఆరోపించారు. గూడూరు మండలం గురిజేపల్లి, షా అబ్దుల్లాపాలెం గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. మద్య నిషేధం అమలు చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్ నకిలీ మద్యం అమ్మి అనేక మంది ప్రాణాలను బలి తీసుకున్నాడని ఆరోపించారు. శిరీష ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. కాగిత కృష్ణప్రసాద్‌కు విజయం చేకూర్చి పెట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, కాసగాని శ్రీనివాస రావు, సిరివెళ్ళ శ్రీనివాసరావు, శాయన సోమయ్య, పోతుల రాము, బేతాళ స్వామి, మునగాల భాస్కర్, కాట్రగడ్డ సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైసీపీకి లేదు : టీడీపీ కార్పొరేటర్లు



మచిలీపట్నం టౌన్ : నగర ప్రజలకు తాగునీరందించలేదని వైసీపీ పాలకులకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి , చిత్తజల్లు నాగరాము అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో పేర్ని నాని ప్రతి రోజూ నగర ప్రజలకు తాగునీరు ఇస్తానని చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారన్నారు. ఎన్నికల హామీని మరచి ఇప్పుడు రెండు రోజులకోసారి తాగునీరు ఇస్తామని చెబుతున్నారన్నారు. కొల్లు రవీంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఎనిమిది రిజర్వాయర్లు నిర్మించి ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూశారన్నారు. టీడీపీ కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్ పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి ఐక్య కృషి : కుమార్‌రాజా



పామర్రు : రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు టీడీపీ శ్రేణులు కృషి చేయాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్లకుమార్‌రాజా అన్నారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, టీడీపీ బీసీ నేత వీరంకి వెంకటగురుమూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని, అందుకోసం అందరూ కృషి చేయాలని అన్నారు. టీడీపీ సీనియర్ నేత గొట్టిపాటి లక్ష్మీదాస్, వల్లూరిపల్లి గణేష్, ఈడే నాని, మంతెన రామాంజనేయులు, పరసా సుబ్రమణ్యం వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ అభ్యర్థి వర్లకుమార్ రాజాను గెలిపించాలని కోరుతూ నాయిబ్రాహ్మణ కాలనీలో జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దాలిపర్తి ప్రసాద్, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆముదాలపల్లి గోపాలకృష్ణ ప్రచారం చేశారు. పామర్రు నియోజకవర్గ అభివృద్ధి టీడీపీకే సాధ్యమన్నారు. అయోధ్య హరిబాబు, మాచవరపు శివప్రసాద్, మోపిదేవి శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు సీటివ్వాలని కోడూరు టీడీపీ నేతల ఏకగ్రీవ తీర్మానం



కోడూరు : మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ కేటాయించాలని కోరుతూ మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల పార్టీ సమావేశంలో నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేసి సంతకాలు సేకరించారు. ఈ సమావేశంలో గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, కొల్లి వెంకటేశ్వరరావు, తోట రాంబాబు, మేడా శివాజీ, కొత్తనాతి వెంకటేశ్వరరావు, తోట రాంబాబు, మేడా శివాజీ, కొప్పనాతి సత్యనారాయణ, కూరాకుల ప్రసాద్, కూరాకుల శివయ్య, ఉప్పాల పోతురాజు, అద్దంకి పాండురంగారావు, అప్పికట్ల రవీంద్రబాబు, రేపల్లె ప్రతాప్, గోలి సాంబశివరావు, మోక యానాదిరావు, దావు మల్లి, పోలాబత్తిన భీమారావు, అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ పహాల్, అబ్దుల్ రజాక్, షేక్ నజీర్, కూరాకుల శివయ్య, గంజాల సుందరరావు, అద్దంకి రవి, దోనేపూడి వరప్రసాద్, మోర్ల మాణిక్యాలరావు, కాగిత ప్రసాద్, కాగిత అంజనేయులు, మల్లాది ప్రసాద్, తండు గంగాధర్, బెల్లంకొండ సుబ్బయ్య, మింగు శివయ్య, మహమ్మద్ ఇమ్రాన్, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో వైసీపీ ఫ్లెక్సీ తొలగింపు

చల్లపల్లి : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించేలా చల్లపల్లిలో వైసీపీ ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీని పంచాయతీ అధికారులు మంగళవారం తొలగింపచేశారు. ప్రధాన సెంటర్లోని కాంప్లెక్స్‌పై "రైతుల కల..నా కల" పేరుతో ముఖ్యమంత్రి రైతుతో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి పి.వి..మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కె.సుధాకర్ ఎన్నికల నియమావళి ప్రకారం హుటాహుటిన సిబ్బందితో బ్యానర్‌ను తొలగింపచేశారు.

సామూహిక కుంకుమార్చనలు



మచిలీపట్నం టౌన్, మార్చి 26 : బలరామునిపేటలో రామానుజాచార్య సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దయా కుంభ్ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం జరిగిన 500 మంది సువాసినులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. లక్ష్మీహోమం నిర్వహించారు. శ్రీకర రామానుజ ఆధ్వర్యంలో నిర్వహించిన చినజీయర్ స్వామి శిష్యులు త్రిదండి స్వామి హాజరై అభిభాషణం చేశారు. లక్ష్మీ విగ్రహాలను నగరంలో ఊరేగింపు జరిపారు. అఖండ లక్ష్మీనామంతో బలరామునిపేటలో ఆధ్యాత్మిక చింతన చోటు చేసుకుంది.



వీసీతో పూర్వ విద్యార్థుల భేటీ

మచిలీపట్నం టౌన్ : పూర్వ విద్యార్థులు విశ్వ విద్యాలయం అభివృద్ధికి కృషి చేయాలని ఉపకులపతి జి. జ్ఞానమణి అన్నారు. ఉపకులపతిని మంగళవారం పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఎం. శ్రావణి, ఎండి నూరుద్దీన్, యూసఫ్, చాట్ల సురేష్, పోతన ఉదయకుమార్ కలిశారు. త్వరలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. రిజిస్ట్రార్ కె. శోభన్‌బాబు, ఇంజనీర్ బసవేశ్వరబాబు పాల్గొన్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

పెడన : నడుపూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ భాస్కరరావు (39) మంగళవారం మద్యం తాగి ఇంటికి రాగా, భార్య నాగమణి మందలించింది. మనస్తాపానికి గురైన భాస్కరరావు పురుగు మందు తాగాడు. వెంటనే అతన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే భాస్కరరావు మృతి చెందాడు. ఎస్సై సూర్యశ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ

గుడివాడ : ప్రపంచ శాంతిని కోరుతూ ఏలూరు రోడ్డులోని మౌంట్ కార్మెల్ మాత దేవాలయం(ఆర్‌సీఎం) చర్చి పరిధిలోని సుమారు 50 మంది దీక్షాపరులు గుడివాడ నుంచి పెద్ద అవుటపల్లిలోని జోసఫ్ తంబి సమాధి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. చర్చి వద్ద బైక్ ర్యాలీని విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయ గురువు ఫాదర్ జాన్‌హరీష్ ప్రారంభించారు. ప్యారిస్ కమిటీ సభ్యులు, ఉపదేశకులు, మరియదళ సభ్యులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

సూర్యదేవాలయం అభివృద్ధికి శ్రీకారం

అవనిగడ్డ రూరల్ : వేకనూరు సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో కాంక్రీట్ పనులను నిర్వహిస్తున్నారు. సూర్యనారాయణ స్వామి, కాశీ అన్నపూర్ణేశ్వరి దేవి, అంజనేయస్వామి ఆలయాలకు కాంక్రీట్ పనులు నిర్వహిస్తున్నట్లు తుంగల వీరవసంతరావు ఇందిరా దంపతులు తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా

అవనిగడ్డ : చల్లపల్లి నుంచి నాగాయలంక మార్కెట్ యార్డుకు వెళ్తున్న ధాన్యం లోడు లారీ ప్రమాదవశాత్తు బందలాయిచెరువు సమీపంలో పంట కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో నీళ్ల లేకపోవటంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రైవేటు పాఠశాలలు రిజర్వేషన్లు పాటించాలి : డీఈవో

మచిలీపట్నం టౌన్ : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం జిల్లాలోని ప్రైవేటు అన్ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్ల సమయంలో జీవో 6 ప్రకారం రోస్టర్ పాయింట్లలో రిజర్వేషన్లు పాటించాలని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. అనాథ, హెచ్ఐవి బాధిత, దివ్యాంగుల పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. 25 శాతం సీట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో తీసుకోవాలన్నారు.



అలరించిన సంగీత విభావరి

మోపిదేవి : పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక జాతర సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించగా, పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. జాతర మహోత్సవంలో భాగంగా సినీ నేపథ్య గాయకులు సాహితీ చాగంటి, హారిక నారాయణ పాటల కచేరి విశేషంగా ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన రవి ఆర్కెస్ట్రా బృందం ఆధ్వర్యంలో సాహితీ చాగంటి, హారిక నారాయణ బృందం ఆలపించిన పాటలు వీక్షకులను ఉర్రూతలూగించాయి.



అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గుడివాడ రూరల్ : బిళ్లపాడు అగ్నిబాధిత కుటుంబానికి హైదరాబాద్‌కు చెందిన మేథో గ్రూపు ఫౌండర్ రంజిత్, వ్యాయామ ఉపాధ్యాయురాలు కోలా అనురాధ మిత్ర బృందం మంగళవారం రూ.30 వేలు అందజేశారు. చిన్నారి పటమట తేజశ్రీ చదువు పూర్తి బాధ్యతను తాను స్వీకరిస్తున్నట్లు రంజిత్ తెలిపారు. రెడ్‌క్రాస్ గుడివాడ వైస్ చైర్మన్ మడక ప్రసాద్, సభ్యులు పి.వి.ఎన్.డి ప్రసాద్, సామాజిక వేత్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకర్లమూడిపాలెంలో విగ్రహ ప్రతిష్ఠ 30న

పెడన రూరల్ : కాకర్లమూడిపాలెం నిర్మించిన రామాలయంలో ఈనెల 30వ తేదీ ఉదయం గం.8.01 నిలకు కోదండరామస్వామి విగ్రహప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. 28, 29 తేదీలలో ప్రతిష్ఠా పూజలు జరుగుతాయని, ప్రతిష్ఠ అనంతరం శాంతి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం 30వ తేదీ 12 గంటలకు భారీ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

పేద విద్యార్థికి సాయం



చల్లపల్లి : రాంకీ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు అన్నారు. చల్లపల్లిలో దివంగత కళ్లేపల్లి చంద్ర కుమారుడు హేమంత్ బీటెక్ విద్యాభ్యాసం కోసం ఫౌండేషన్ పంపిన రూ.12వేల చెక్‌ను ఆయన అందజేశారు. విద్యార్థి కుటుంబ పరిస్థితిని ఫౌండేషన్ సీఎస్ఆర్ మేనేజర్ చాట్రగడ్డ మహేంద్రబాబు చైర్మన్ రామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆర్థిక సాయం మంజూరు చేశారు. రాజా స్కూల్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ద్వారా విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, అధ్యక్షుడు గోవిందరాజుల అశ్వినికుమార్ విద్యార్థి తల్లి, సోదరిలకు ఈ చెక్కు అందజేశారు.



గుర్విందపల్లి విద్యార్థుల ప్రతిభ

తోట్లవల్లూరు : గుర్విందపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశానికి అర్హత సాధించారని ఎంఈవో జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో చేరేందుకు నిర్వహించిన అర్హత పరీక్షల్లో దేవరపల్లి అక్షయ్, వల్లే సాయి దుర్గాప్రసాద్, వల్లే ఝాన్సీ, కర్రా కీర్తిప్రియ, వల్లే గీతా దీప్తి ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులు మట్టా రాజేష్, జె ఉషారాణిని ఎంఈవో వెంకటేశ్వరరావు,. ఎంఈవో-2 సురేష్ అభినందించారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

అవనిగడ్డ : ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి బాల సుబ్రహ్మణ్యం, డీఎస్పీ మురళీధర్‌రావు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.30 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నేర చరిత్ర ఉన్న వారిని బైండోవర్ చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సీఐ త్రినాథ్, చల్లపల్లి సీఐ నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

అర్చకులపై దాడికి ఖండన

మచిలీపట్నం టౌన్ : అర్చకులపై దాడులు చేస్తే దేవునిపై దాడులు చేసినట్టే అని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ పి.వి.ఫణికుమార్ అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో దేవాలయాలు, , అర్చకులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కాకినాడ శివాలయంలో అర్చకులపై దాడిని ఆయన ఖండించారు. నిమ్మగడ్డ శ్రీధర్, గణేష్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, నాగలింగం అయోధ్య రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పెడన రూరల్ : నందమూరు వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్ నెం. 9440730562లో సంప్రదించాల్సిందిగా కోరారు.